క్లుప్తంగా

క్రిస్మస్ శుభాకాంక్షలు



మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: క్రైస్తవ సోదరులకు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, లోక రక్షకుడు, కరుణామయుడైన ఏసు ప్రభువు దీవెనలతో అందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని మంత్రి ఆకాంక్షించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: పట్టణ నాగులకట్ట యూత్ అసోసియేషన్ 2024 నూతన క్యాలెండర్లను ఆదివారం స్థానిక స్వగృహంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కార్తీక్, అదనపు కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు విష్ణువర్ధన్, విజయకాంత్, మోహన్, నాగకార్తీక్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

అర్జున్‌రెడ్డి కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తాం



అర్జున్‌రెడ్డి కాలనీలో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ : పట్టణ శివారులోని అర్జున్‌రెడ్డి కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఆదివారం అర్జున్‌రెడ్డి కాలనీలో చైర్మన్ పర్యటించారు. స్థానికులతో ఆయన మాట్లాడారు. మంచినీటి సరఫరా, సీసీ రోడ్లు, కాలువల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని డీఈ రసూల్‌కు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్ హుసేన్, కమలాపురం సర్పంచ్ అర్జున్‌రెడ్డి, కౌన్సిలర్ వంశి తదితరు పాల్గొన్నారు.

యాచకులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

డోన్ : ప్రార్థన సమయం ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీగా పనిచేస్తున్న ప్రభాకర్ ఆర్థిక సాయంతో యాచకులకు దుప్పట్లను పంపిణీ చేశామని సంస్థ నిర్వాహకులు జాన్ ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో దేవరాజు, ఫక్ృద్దీన్, రాజేష్, ప్రమోద్‌కుమార్‌లు పాల్గొన్నారు.

రక్త దానం



రక్తం దానం చేస్తున్న తిరుపాల్ నాయుడు

డోన్ టౌన్ : ద్రోణాచలం సేవా సైనికుడు తిరుపాల్ నాయుడు తన పుట్టిన రోజు సందర్భంగా రక్తదానం చేశారు.ఆదివారం నంద్యాల పట్టణంలోని బ్లండ్ బ్యాంక్‌కు వెళ్లి బి.పాజిటివ్ రక్తాన్ని 19వ సారి స్వచ్ఛందంగా దానం చేసి మానవత్వం చాటుకున్నాడు. ఈ సందర్భంగా స్నేహితులు, బంధువులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



లబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులను అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : మండలంలోని ఆవులదొడ్డి, జగదుర్తి గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీజేపీ డోన్ నియోజకవర్గ ఇంచార్జ్ సందు వెంకటరమణ, మండల అధ్యక్షుడు బొంకూరి రవికుమార్ వివరించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మద్దిలేటి, రాజశేఖర్‌రెడ్డి, ఏపీఓ అబ్దుల్ షకూర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభరాణి, పంచాయితీ కార్యదర్శి కృష్ణకుమారి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవాలకూ... ఆరోగ్య రక్ష !

- పశువులకు జీవం పోస్తున్న సంచార పశు ఆరోగ్యసేవ రథం
- ఉచితంగా సర్వవైద్య సేవలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు, పశుపోషకులు



డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ రథం



గేదెకు వైద్య సేవలందిస్తున్న పశు వైద్య సిబ్బంది

బనగానపల్లె : ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూగజీవాల ఆరోగ్య సంరక్షణకూ ప్రత్యేక చర్యలు చేపట్టింది. డాక్టర్ వైఎస్సార్‌సంచార పశుఆరోగ్య సేవ వాహనం(అంబులెన్స్) ద్వారా పశువులకు నాణ్యమైన వైద్య సేవలు అందజేస్తుంది. సంచార పశు ఆరోగ్య సేవ వాహనంలో డాక్టర్‌తో పాటు సిబ్బంది పశువులకు వైద్య సేవలు అందజేస్తారు. గ్రామాలకు వెళ్లి రైతు గుమ్మం ఎదుటే పశువులకు వైద్య చికిత్సలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు మండల కేంద్రాల్లోని పశువైద్యశాలలకు తీసుకవెళ్లాల్సి వచ్చేది. అక్కడికి మూగజీవాలను తీసుకెళ్లేందుకు పాడి రైతులు, పశుపోషకులు ఇబ్బందులు పడేవారు. దీంతో ఎంతో పశుసంపదను కోల్పోయారు కూడా. ఈ సమస్యను అధిగమించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పతిష్టాత్మకంగా డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ పథకం అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు బనగానపల్లె నియోజకవర్గానికి రెండు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను కేటాయించారు. బనగానపల్లె పశువైద్యశాలకు కేటాయించిన వాహనం బనగానపల్లెతోపాటు కోవెలకుంట్ల, అవుకు మండలాల్లోని గ్రామాలకు పశువులకు వైద్య సేవలు అందజేస్తుంది. అదే విధంగా సంజామల పశువైద్యశాలకు కేటాయించిన వాహనం ద్వారా సంజామలతోపాటు కొలిమిగుండ్ల మండలాల్లోని మూగజీవాలకు వైద్య సేవలు అందుతున్నాయి. పాడి రైతులతో పాటు మేకలు, గొర్రెలకాపరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

1962 టోల్‌ఫ్రీ నంబర్ కేటాయింపు

మూగజీవాలు అనారోగ్యానికి గురైనప్పుడు పశుపోషకులు ప్రభుత్వం కేటాయించిన 1962 ట్రోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాల్సి ఉంటుంది. రైతు పేరు, గ్రామం, మండలం వివరాలతో పాటు పశువు ఆరోగ్య సమస్యను వివరించాలి. ఈ సమాచారం వెంటనే సంబంధిత రైతుభరోసా కేంద్రానికి చేరుతుంది. అనంతరం డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వైద్య బృందానికి సమాచారం వెళ్తుంది. పశువు ఆరోగ్య పరిస్థితి మేరకు పశువైద్య బృందం వెంటనే స్పందిస్తుంది. సంచార పశు ఆరోగ్య సేవ వాహనంలో ఆ గ్రామం, ప్రాంతం వెళ్లి అనారోగ్యానికి గురైన పశువుకు వైద్య సేవలు అందజేస్తారు. అత్యవసర పరిస్థితి ఉంటే పశువును వాహనంలో సమీప పశువైద్యశాలకు తీసుకెళ్లి పూర్తిస్థాయిలో వైద్య చికిత్సలు చేస్తారు. అనంతరం పశువును రైతు ఇంటికి ఉచితంగా చేర్చడం జరుగుతుంది.

అంబులెన్స్ సేవలు బాగున్నాయి



డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్ సేవలు బాగున్నాయి. పశువుల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుంది. గతంలో పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు చాలా ఇబ్బందులు పడ్డాం. దూరప్రాంతాల్లో ఉన్న పశువైద్యశాలలకు పశువులు తీసుకెళ్లలేక నష్టపోయాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం రైతులతో పాటు గొర్రెలు, మేకల కాపరులకు ఎంతో ఉపయోగకరం.

– ఎస్ సోమ్లానాయక్ రైతు కాలేనాయక్‌తాండా బనగానపల్లె మండలం

గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు అందస్తున్నాం



మూగజీవాల ప్రాణాలకు డాక్టర్ వైఎస్సార్ పశు ఆరోగ్య సేవ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంది. గ్రామాలకు వెళ్లి పశువులకు వైద్య సేలందిస్తున్నాం. ప్రతి నెలా గ్రామాలకు వెళ్లి 160–200 పశువులకు వైద్యం చేస్తున్నాం. పశువు తీవ్ర అనారోగ్యంగా ఉంటే వెంటనే వాహనంలో సమీప పశువైద్యశాలకు తీసుకెళ్లి పూర్తిస్థాయిలో వైద్యం చేస్తున్నాం. పశుపశుపోషకులకు సూచనలు అందిస్తున్నాం. ప్రత్యేకించి సీజన్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ రైతులు, గొర్రెల కాపరులను చైతన్య పరుస్తున్నాం.

– తస్లీమానస్రున్, పశువైద్యులు, డాక్టర్ వైఎస్సార్ పశు ఆరోగ్య సేవ రథం

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల కింద జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి సబ్ స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి పూట వేళల్లో తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను వివరించారు. ముక్కమల్ల, ముదిగేడు, అల్వకొండ, వసంతాపురం, కమలపూరి, గిద్దలూరు, కానాల, అక్కంపల్లె, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె ఫీడర్లలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

అనాథలకు దుప్పట్ల పంపిణీ

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని అనాథలు, సాధువులకు ఆదివారం రాత్రి ఏపీ ముస్లిం మైనార్టీ సోషల్ మీడియా స్టేట్ కో ఆర్డినేటర్ ముజ్‌బుర్ రహీమాన్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్, బ్రహ్మంగారి నేల మఠం తదితర ప్రాంతాల్లో నిద్రించే వారికి ముజ్‌బుర్‌రహీమాన్ దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంహెచ్‌పీ పట్టణ ఇన్‌చార్జ్ అబ్బాస్ హుస్సేన్, మహబూబ్‌బాషా, వలిభాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాటసాని సాయం మరువం



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని సత్కరించిన కోవెలకుంట్ల మండలం, భీమునిపాడు, కంపమళ్ల రైతులు

- కాటసాని రామిరెడ్డిని సన్మానించిన రైతులు

బనగానపల్లె : ప్రత్యేక చొరువతో కేసీ కెనాల్–21వ బ్లాక్ హరివరం చానల్ ద్వారా సాగునీరు అందించిన మీ సాయం మరువమని కోవెలకుంట్ల మండలం భీమునిపాడు, కంపమళ్ల గ్రామాలకు చెందిన రైతులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక స్వగ్రహంలో రైతులు ఎమ్మెల్యే కాటసానికి పూలమాలలు వేసి సన్మానించారు. నీటి విడుదల చేయించకుంటే పంటలు ఎండిపోయి నష్టపోయే పరిస్థితి అని, మీ చొరువ మూలంగా ఇప్పటికే పంటలకు రెండు తడులు కట్టుకున్నామని రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. మరో వారంలో మరోమారు నీటిని విడుదల చేయిస్తే పంటలు చేతికి దక్కుతాయన్నారు. చివరి తడికి నీరు అందించి ఆదుకోవాలని ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు కార్యదర్శి సోములలోకేశ్వర్‌రెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం జాయింట్ కార్యదర్శి సోముల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, రైతులు నరసింహారెడ్డి బీమునిపాడు వీరారెడ్డి, నరసింహారెడ్డి, మనోహర్‌రెడ్డి మనోజ్, శ్రీధర్‌నాయుడు, రమణ, శివన్న, ఆచారి, పెద్దనరసింహారెడ్డి, వలి, యదార్థుడు, సుబ్బరాయుడు, ప్రకాశం, రాము మాధవ, నడిపివలి, హుస్సేన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్

డోన్ టౌన్ : ఏదైనా వస్తువు కొనుగోలు సమయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని మండల విద్యాధికారి ప్రభాకర్, సమగ్ర వినియోగదారుల సంక్షేమ సంస్థ అధ్యక్షుడు సాధనగిరి రామకృష్ణారెడ్డి సూచించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం ముగింపు సందర్భంగా ఆదివారం స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో వినియోగదారుల హక్కులు, చట్టాలపై వారు అవగాహన కల్పించారు. వస్తువు నాణ్యత, రసీదుల ప్రాముఖ్యతను వారు వివరించారు. అనంతరం వినియోగదారులను హక్కులకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ మేరీ, సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: క్రిస్మస్ పండుగ సందర్భంగా బెలుం సీఎస్ఐ చర్చి ఆవరణలో సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఆదివారం బహుమతులు అందజేసే దాతలు మారం శేఖర్, దానమయ్య, పేతురు ప్రారంభించారు. 28 కబడ్డీ జట్లు ఈపోటీల్లో పాల్గొనగా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని ఈ సందర్భంగా దాతలు క్రీడాకారులకు సూచించారు. కబడ్డీ పోటీలను తిలకించేందుకు బెలుంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి సంఘ పెద్దలు రమేష్, బాలరాజు, దానమయ్య, ఏసయ్య, యోహానా, సచ్చీలుడు, ఆర్గనైజర్లు మద్దిలేటి, శేషు, బుజ్జి, పీఈటీలు శివ, బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు కాశీనాయన ఆరాధనోత్సవాలు

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్ల గ్రామంలో వెలసిన కాశీనాయన ఆశ్రమంలో సోమవారం కాశీనాయన 28వ ఆరాధనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి జ్యోతి ప్రజ్వలన ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆరాధనోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

ప్రారంభమైన క్రిస్మస్ ప్రార్థనలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫాదర్ ఎడ్వర్డ్

డోన్ : క్రిస్మస్ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధతో ప్రారంభమయ్యాయి. పట్టణంలోని చిగురుమానుపేట ఆగాపే చర్చిలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక పార్థనలు చేశారు. అనంతరం చర్చి పాస్టర్లు అగస్టీన్, రేస్, విమలమ్మ, నవీన్ పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

సంజామల: మండలంలో క్రిస్మస్ ప్రార్థనలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. యేసు క్రీస్తు జన్మదినం పురష్కరించుకుని చర్చిలలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయా గ్రామాలోని చర్చిల్లో క్రైస్తవ సోదర్లు ప్రత్యేక పార్థనలు చేశారు. యేసు సేవలను ఈ సందర్భంగా పాస్టర్లు గుర్తు చేశారు.

బేతంచెర్ల : క్రిస్మస్‌ను పురస్కరించుకుని క్రైస్తవులు ఆయా చర్చిలలో ఆదివారం భక్తిశ్రద్ధతో ప్రార్థనలు చేశారు. పట్టణంలోని సీఎస్ఐ, ఆర్‌సీఎం, హోసన్నా, లెమెన్స్ ఇవాంజలికల్, ఆర్ఎస్ రంగాపురం, సిమెంట్‌నగర్ గ్రామాల్లోని ప్రార్థన మందిరాలలో ఉదయం నుంచే ప్రార్థనలు ప్రారంభమయ్యాయి.

బనగానపల్లెరూరల్: మండల కేంద్రం బనగానపల్లెతోపాటు గ్రామాల్లో ఆదివారం క్రిస్మస్ ప్రార్థనలు భక్తిశ్రద్ధ మధ్య ప్రారంభమయ్యాయి. యేసుక్రీస్తు జన్మదినాన్ని గుర్తు చేసుకుంటూ క్రైస్తవ సోదరులు చర్చిల్లో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. మండల కేంద్రమైన బనగానపల్లె పట్టణంలో సీఎస్ఐ టౌన్ చర్చిలో ఫాదర్ రెవరెండ్ ఆల్బర్ట్, బేతంచర్ల రోడ్డులోని మదర్‌థెర్సిసా చర్చిలో ఫాదర్ బాబు రాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పండ్లు, బ్రెడ్డు పంపిణీ

బనగానపల్లె రూరల్ : క్రిస్మస్ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రోగులకు ఆదివారం మండలంలోని మిట్టపల్లె గ్రామానికి చెందిన ఎస్ ప్రకాష్ బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు పద్మావతి, ఎస్‌హరున్‌కుమార్, సంజీవకుమార్, పునీత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణ పనులు



చురుగ్గా సీసీరోడ్డు నిర్మాణ పనులు

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో రూ. 10 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో కాలనీలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నటున్ల గ్రామ సర్పంచ్ బాలమద్దిలేటి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శంకరయ్య తెలిపారు. ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలు తీరనుండడంతో కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

కోవెలకుంట్ల: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు చెల్లించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఏ షరీఫ్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగుల పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్, డీఏ, పీఆర్సీ అరియర్స్ అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ

మహానంది: ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్సును అప్పగించి ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. ప్రకాశం జిల్లా వినుకొండకు చెందిన సుబ్రహ్మణ్యం ప్రసాద్ ఆదివారం గాజులపల్లె రైల్వే స్టేషన్ వద్ద ఆటో ఎక్కాడు. మహానందిలో ఆటో దిగి వెళ్లిపోగా డ్రైవర్ మాలిబాషాకు ఆటోలో పర్సు కనిపించింది. దీంతో దేవస్థానం సమాచారం కేంద్ర వద్ద ఇచ్చి అనౌన్స్ చేయించగా బాధితుడు విషయం తెలుసుకుని రావడంతో అతనికి పర్సు అందించారు. పర్సులో కొంత నగదుతో పాటు ఏటీఎం కార్డులు ఉన్నట్లు చెప్పారు.

దత్త జయంతి ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయస్వామి, హోమం నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని ఉడుములపాడు గ్రామం జాతీయ రహదారిపై కొలువైన శ్రీదత్తాత్రేయస్వామి ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో దత్త జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 27 వరకు నాలుగు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ప్రతి రోజు 5గంటలకు సుప్రభాత సోత్రం, అఖండ దీపారాధనతో ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం 12గంటల వరకు హోమాలు, యాగాలు ప్రధాన అర్యకులు కర్లే శేషావలి శర్మ ఆధ్వర్యంలో సాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 26వ తేదీన మధ్యాహ్నం 3గంటలకు రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేత వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ.50 వేలు, రూ.25వేలు, రూ.15వేలు చొప్పున బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

నాగరాజుకు ఉత్తమ సామాజిక సేవా అవార్డు



మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఏఈ నాగరాజు

డోన్ టౌన్ : పట్టణానికి చెందిన ఏఈ నాగరాజుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సామాజిక సేవకుడి అవార్డు ప్రదానం చేసింది. జాతీయ వినియోగదారుల దినోత్సవం ముగింపు సందర్భంగా ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో నాగరాజు ఈ అవార్డును అందుకున్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు ఫుడ్ అండ్ సివిల్ సప్లై శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ తదితర అధికారులు అవార్డును నాగరాజుకు అందజేశారు. డోన్ తాలూకా వినియోగదారుల రక్షణ సంఘం అధక్షునిగా, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కన్వీనర్‌గా నాగరాజు ప్రజలకు దాదాపు 28 సంవత్సరాలుగా సేవలు అందజేశారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్గించారు. ఈయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయనకు ఉత్తమ సామాజిక సేవకుడి అవార్డు ప్రదానం చేసింది.





కొలిమిగుండ్ల మండలం, నందపాడు గ్రామంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్

ప్రభుత్వ భవనాలు ముస్తాబు

- 27న ఆర్బీకే, హెల్త్‌క్లినిక్ భవనాలు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మారుమూల గ్రామాల్లో సైతం ప్రభుత్వ భవనాల నిర్మాణంతో కళకళలాడుతున్నాయి. మండల పరిధిలోని నందిపాడులో రూ.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు ప్రాంభానికి ముస్తాబయ్యాయి. ఈనెల 27న సాయంత్రం నూతన భవనాలను జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభిస్తారని సర్పంచ్ గుర్విరెడ్డి ఆదివారం తెలిపారు. ప్రజానాయకులు,కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.



ఫ్లిక్కర్స్...జొన్న పంటకు రక్ష !

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన జొన్న కంకిదశలో ఉండటంతో పొలం చుట్టూ ఫ్లిక్కర్స్(మెరిసే రిబ్బన్లు) ఏర్పాటు చేసుకుని పక్షులబారి నుంచి పంటను కాపాడుకుంటున్నారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఆయా మండలాల్లో సాగైన కంకిపై పక్షులు వాలి జొన్న పిసుకుళ్లను తింటూ నష్టం చేకూరుస్తున్నాయి. వాటి బారి నుంచి పంటను రక్షించుకునేందుకు పొలం చుట్టూ రైతులు మెరిసే రిబ్బన్లు అమర్చారు. ఎండ, గాలికి రిబ్బన్లు మెరుస్తూ కదులుతుండటంతో పక్షులు పంటవైపు రావడం లేదు. – కోవెలకుంట్ల